సాక్షి
రంగారెడ్డి

శనివారం । 14 । సెప్టెంబర్ । 2024



వేగ నియంత్రణతో..

వాహనదారులు మలువులు, బస్ స్టేజీల వద్ద వేగ నియంత్రణ పాటించాలని రాజేంద్రనగర్ ట్రాఫిక్ ఏసీపీ బాలాజీ అన్నారు. 8లో▸



ఆస్తిపై కన్నేసి..

ఆస్తి కోసం అన్ననే హతమార్చాడు.. ఆపై మృతదేహాన్ని చెరువులోపడేసి ఆత్మహత్యగా చిత్రీకరించేందుకు యత్నించాడు. 8లో▸



చోరీ ముఠా గుట్టురట్టు

అర్ధరాత్రి వాహనాల నుంచి బ్యాటరీలు చోరీ చేస్తున్న ముఠా గుట్టు రట్టయింది. ముగ్గురిని గుర్తించగా ఒకరు చిక్కారు. 8లో▸

న్యూస్‌రీల్

అరెస్టులు, కేసులు కొత్త కాదు

మాజీమంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే సబితారెడ్డి



సబితారెడ్డి నివాసం వద్ద మోహరించిన పోలీసులు

మహేశ్వరం: గృహ నిర్బంధాలు, అరెస్టులు, కేసులు తమకు కొత్త కాదని మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే పి.సబితారెడ్డి అన్నారు. నగరంలోని శ్రీనగర్ కాలనీలో ఉన్న ఆమె నివాసంలో పోలీసులు శుక్రవారం హౌస్ అరెస్ట్ చేశారు. శేరిలింగపల్లి ఎమ్మెల్యే అరకెపూడి గాంధీ ఇంట్లో బీఆర్ఎస్ పార్టీ సమావేశం నిర్వహిస్తామని హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి, బీఆర్ఎస్ మేడ్చల్ జిల్లా అధ్యక్షుడు శంభీపూర్ రాజు పిలుపునివ్వడంతో శాంతి భద్రతలకు విఘాతం కలగకుండా పోలీసులు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, నేతలను ముందస్తుగా గృహ నిర్బంధం చేశారు. అందులో భాగంగానే మహేశ్వరం ఎమ్మెల్యే పి.సబితారెడ్డిని ఉదయం ఇంటి నుంచి బయటకు వెళ్లనీయకుండా ఇంటి వద్ద పోలీసు బందోబస్తు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పోలీసులు గృహ నిర్బంధాలతో ఆంక్షలు విధించడం సరి కాదని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో నియంతృత్వ పాలన కొనసాగుతోందని దుయ్యబట్టారు. ప్రజా పాలన అంటే నిర్బంధాలా అని ప్రశ్నించారు. ప్రజలు కాంగ్రెస్ అరాచకాలను గమనిస్తున్నారని, సమయం వచ్చినప్పుడు తగిన బుద్ధి చెబుతారన్నారు.

ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి

ఎస్టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సదానందంగౌడ్



మాట్లాడుతున్న సదానందంగౌడ్

ఆమనగల్లు: ఉపాధ్యాయులకు పెండింగ్‌లో ఉన్న నాలుగు డీఏలను ప్రభుత్వం వెంటనే మంజూరు చేయాలని ఎస్టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సదానందంగౌడ్ డిమాండ్ చేశారు. ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారమే ధ్యేయంగా 77 ఏళ్లుగా తమ సంఘం పోరాడుతోందని అన్నారు. ఆమనగల్లు మండలం ఆకుతోటపల్లిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, మాడ్గుల మండల పరిధిలోని కొల్కులపల్లి, నాగిళ్ల, మాడ్గుల, అవురుపల్లి, ఇర్విన్ ఉన్నత పాఠశాలల్లో శుక్రవారం సభ్యత్వ నమోదు నిర్వహించారు. ఆయా పాఠశాలల్లో నిర్వహించిన సమావేశాల్లో సదానందంగౌడ్ మాట్లాడుతూ.. ప్రభుత్వం పదోన్నతులు, బదిలీలు నిర్వహించినప్పటికీ ఉపాధ్యాయులకు జూలై నెల వేతనాలు నేటికీ మంజూరు చేయకపోవడం శోచనీయమని అన్నారు. వేతనాలు అందక వారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పెండింగ్‌లో ఉన్న డీఏలను మంజూరు చేయడంతో పాటు మెరుగైన ఫిట్‌మెంట్‌తో వెంటనే పీఆర్సీ ప్రకటించాలని కోరారు. అన్ని ప్రభుత్వ పాఠశాలలకు ఉచిత విద్యుత్‌ను అందించడంపై ఆయన హర్షం వ్యక్తం చేశారు. వెంటనే డీఎస్సీ వేసి నియామకాలు పూర్తి చేయాలని, అప్పటివరకు ఇబ్బంది లేకుండా విద్యా వలంటీర్లను నియమించాలన్నారు. కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షుడు ప్రవీణ్‌కుమార్, ప్రధాన కార్యదర్శి పాండురంగారెడ్డి, కోశాధికారి బాలనర్సింహులు, రాష్ట్ర నాయకులు సుధాకర్, మండల శాఖ అధ్యక్షుడు కసిరెడ్డి అశోక్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఫ్యూచర్.. భద్రతపై నజర్

- నెట్ జీరో సిటీ పోలీస్ స్టేషన్ ఏర్పాటుకు సర్కార్ యోచన
- హైదరాబాద్ గ్రీన్ ఫార్మాసిటీ ఠాణా పేరు మార్చేందుకు కసరత్తు
- ప్రస్తుతం నక్కర్తమేడిపల్లిలో అద్దె భవనంలో కొనసాగుతున్న పోలీస్ స్టేషన్
- కుర్మిద్ద–మీరాఖాన్‌పేట మధ్య శాశ్వత భవన నిర్మాణంపై దృష్టి
- భవిష్యత్తులో ఫోర్త్ కమిషనరేట్‌గా ఏర్పాటయ్యే అవకాశం



నక్కర్తమేడిపల్లిలో కొనసాగుతున్న హైదరాబాద్ గ్రీన్ ఫార్మాసిటీ పోలీస్ స్టేషన్

యాచారం: భవిష్యత్తులో నిర్మించబోయే ఫ్యూచర్ సిటీని దృష్టిలో పెట్టుకుని భద్రత, ఆ ప్రాంతంలో నివసించే ప్రముఖుల రక్షణ చర్యల విషయంలో సర్కార్ దృష్టి సారించింది. హైదరాబాద్ మహానగరం, దాని చుట్టూ ఉన్న ప్రాంతాల ప్రజల రక్షణ చర్యల నిమిత్తం ప్రస్తుతమున్న హైదరాబాద్, సైబరాబాద్, రాచకొండ కమిషనరేట్‌గా దీటుగా భవిష్యత్తులో ఈ ప్రాంతంలో నాలుగో కమిషనరేట్‌ను ఏర్పాటు చేసే ఆలోచన చేస్తున్నట్లు సమాచారం. గత ప్రభుత్వ హయాంలో జిల్లా పరిధిలోని ఇబ్రహీంపట్నం, మహేశ్వరం, కల్వకుర్తి నియోజకవర్గాల మధ్య ఫార్మాసిటీ ఏర్పాటుకు నిర్ణయించిన సంగతి తెలిసిందే. దీని కోసం 19,333 ఎకరాల భూ సేకరణకు సిద్ధమై ఆయా గ్రామాల్లో 13 వేల ఎకరాలకు పైగా అసైన్డ్, పట్టా భూములు సేకరించింది. ఫార్మాసిటీలో నివసించే శాస్త్రవేత్తలు, ఇంజనీర్లు, విద్యావేత్తల రక్షణ నిమిత్తం ప్రత్యేక పోలీస్ వ్యవస్థను ఏర్పాటు చేయాలని సంకల్పించింది. ఈ మేరకు నక్కర్తమేడిపల్లిలో హైదరాబాద్ గ్రీన్ ఫార్మాసిటీ పేరుతో రాచకొండ కమిషనరేట్ పరిధిలో ప్రత్యేక పోలీస్ స్టేషన్‌కు శ్రీకారం చుట్టింది.

భవిష్యత్తు అవసరాల దృష్ట్యా..

హైదరాబాద్ గ్రీన్ ఫార్మాసిటీ పోలీస్ స్టేషన్ ఇక నెట్ జీరో సిటీ పోలీస్ స్టేషన్‌గా మారబోతుంది. ఇప్పటికే ప్రభుత్వం నుంచి పోలీస్ ఉన్నతాధికారులకు సూచనప్రాయంగా ఆదేశాలు సైతం వచ్చినట్లు తెలుస్తోంది. అందులో భాగంగానే పోలీస్ ఉన్నతాధికారులు ఈ పోలీస్ స్టేషన్‌ను కుర్మిద్దలో ఏర్పాటు చేసేలా దృష్టి పెట్టారు. కొద్ది రోజుల క్రితం గ్రామంలోని పలు అద్దె భవనాలను పరిశీలించినట్లు సమాచారం. అప్పట్లో యాచారం, కందుకూరు పోలీస్ స్టేషన్ల పరిధిలోని పది గ్రామాలు, మరో పది అనుబంధ గ్రామాలను కలిపి హైదరాబాద్ గ్రీన్ ఫార్మాసిటీ పోలీస్ స్టేషన్ ఏర్పాటు చేశారు. కందుకూరు పోలీస్ స్టేషన్ పరిధిలోని ఆకులమైలారం, సాయిరెడ్డిగూడ, ముచ్చర్ల, సార్లరావులపల్లి, మీరాఖాన్‌పేట తదితర గ్రామాలు 20 నుంచి 25 కిలోమీటర్ల దూరంలో ఉంటాయని ఆయా గ్రామాల ప్రజలు అప్పట్లోనే వ్యతిరేకించారు. ఈ ఠాణా పరిధిలోకి తమ గ్రామాలను చేర్చొద్దని అప్పటి మంత్రి సబితారెడ్డి, పోలీస్ ఉన్నతాధికారులకు విన్నవించారు. అయితే అప్పట్లో ఫార్మాసిటీకి వ్యతిరేకంగా నక్కర్తమేడిపల్లి, నానక్‌నగర్, కుర్మిద్ద, తాడిపర్తి గ్రామాల్లో పోరాటాలు సాగాయి. ఉద్యమకారులను కట్టడి చేయడం కోసం అప్పటి సర్కార్ నక్కర్తమేడిపల్లిలో పోలీస్ స్టేషన్ ఏర్పాటు చేసింది. సీఐతో పాటు, ఇద్దరు ఎస్ఐలు, మరో 20 మందికిపైగా సిబ్బందితో ప్రస్తుతం ఈ ఠాణా కొనసాగుతోంది. భవిష్యత్తు అవసరాల దృష్ట్యా నెట్ జీరోసిటీ పోలీస్ స్టేషన్‌కు కుర్మిద్ద–మీరాఖాన్‌పేట గ్రామాల మధ్య 10 నుంచి 25 ఎకరాల స్థలంలో శాశ్వత భవనం నిర్మించే యోచనలో సర్కార్ ఉంది. ఇక్కడ పోలీస్ స్టేషన్‌ను ఏర్పాటు చేస్తే అన్ని గ్రామాల ప్రజలకు అనువుగా ఉంటుందని భావిస్తోంది.

ఫ్యూచర్‌లో నాలుగో కమిషనరేట్

ఫార్మాసిటీ కోసం సేకరించిన భూముల్లో రేవంత్ రెడ్డి సర్కార్ ఫ్యూచర్ సిటీ నిర్మాణానికి పూనుకుంది. ఇప్పటికే సీఎం రేవంత్‌రెడ్డి బేగరికంచెలో యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీకి శంకుస్థాపన చేయడం తెలిసిందే. 13 వేల ఎకరాల్లో ఎలక్ట్రానిక్స్ అండ్ జనరల్ పరిశ్రమ, లైఫ్ సెన్స్ హబ్, రెసిడెన్షియల్ జోన్, రెసిడెన్షియల్ మిక్స్‌డ్ యూజెస్, స్పోర్ట్స్ హబ్, హెల్త్, ఎడ్యుకేషన్, వినోదం, పర్యాటకం, క్రీడా, ఏఐసిటీల ఏర్పాటుకు మాస్టర్ ప్లాన్ సిద్ధం చేయడం విదితమే. ఇక జనావాసాలకు దూరంగా కుర్మిద్ద, కడ్తాల్ అటవీ ప్రాంతాల సమీపంలో కొన్ని ఎకరాల్లో ఫార్మా, పరిశోధన కేంద్రాలకు కేటాయించేలా సర్కార్ నిర్ణయించింది. నిర్మించబోయే ఫ్యూచర్ సిటీకి రోడ్డు మార్గం కోసం ప్లాన్ రెడీ చేసింది. ఇంత పెద్ద మొత్తంలో పరిశ్రమలు, హబ్‌లు, పెద్దపెద్ద నిర్మాణ సంస్థలు నిర్మించబోతున్న దృష్ట్యా ఫ్యూచర్ సిటీకి ప్రత్యేక కమిషనరేట్ ఉండాలని ఆలోచన చేస్తున్నట్లు సమాచారం. ఫ్యూచర్ కమిషనరేట్‌కు శ్రీశైలం, నాగార్జునసాగర్ రహదారులను, ఔటర్‌రింగ్ రోడ్డుకు అనుసంధానంగా వంద అడుగుల రోడ్డు విస్తరణ చెపట్టేలా ఇప్పటికే అధికారులు ప్లాన్ రెడీ చేశారు. ఇదే విషయమై ఓ పోలీస్ ఉన్నతాధికారిని 'సాక్షి' సంప్రదించగా హైదరాబాద్ గ్రీన్ ఫార్మాసిటీ పోలీస్ స్టేషన్ స్థానంలో నెట్ జీరో సిటీ పోలీస్ స్టేషన్‌గా మార్చబోతున్నట్లు సమాచారం ఉందన్నారు.

పంతం నెగ్గింది

- పెద్ద అంబర్‌పేటలో గెలిచిన అవిశ్వాసం
- చైర్‌పర్సన్ చెవుల స్వప్నకు 17మంది వ్యతిరేకం
- నివేదికను కలెక్టర్‌కు అందజేస్తామన్న అధికారులు



చైర్‌పర్సన్‌కు వ్యతిరేకంగా ఓటింగ్‌లో పాల్గొన్న కౌన్సిలర్లు

అబ్దుల్లాపూర్‌మెట్: పెద్దఅంబర్‌పేట పురపాలక సంఘం చైర్‌పర్సన్‌పై కౌన్సిలర్లు పెట్టిన అవిశ్వాస పరీక్షలో కౌన్సిలర్లదే పైచేయిగా నిలిచింది. పార్టీలకు అతీతంగా ఏకమైన 17మంది తమ పట్టు నిలుపుకొన్నారు. చెవుల స్వప్నను పదవి నుంచి తప్పించేందుకు ఏడాదిన్నర కాలంగా ప్రయత్నిస్తున్న వారు అవిశ్వాస పరీక్షలో తమ పంతం నెగ్గించుకున్నారు. శుక్రవారం ఉదయం తట్టిఅన్నారంలోని వార్డు కార్యాలయంలో ఇబ్రహీంపట్నం ఆర్డీఓ అనంతరెడ్డి ఆధ్వర్యంలో జరిగిన కౌన్సిల్ సమావేశానికి మొత్తం 24 మంది కౌన్సిలర్లకు గాను 17మంది హాజరయ్యారు. చైర్‌పర్సన్‌ను దింపేందుకు కావాల్సిన కోరం ఉండడంతో ఆర్డీఓ సమావేశాన్ని నిర్వహించారు. కౌన్సిలర్లు గ్యార శ్రీనివాస్, వడ్డేపల్లి విద్యావతి, పసుల రాజేందర్, దండెం కృష్ణారెడ్డి, పండుగుల జయశ్రీ, చల్లూరి మురళీధర్‌రెడ్డి, పబ్బతి లక్ష్మణ్, మద్ది నరేందర్‌రెడ్డి, తొండెపు రోహిణి, పాశం అర్చన, మండలి కోటేశ్వరరావు, రమావత్ పరశురాం, జోర్క గీత, ఓరుగంటి సుజాత, చెవుల హరిశంకర్, సిద్ధంకి కృష్ణారెడ్డి, కందాడ అనుపమ చైర్‌పర్సన్‌కు వ్యతిరేకంగా చేతులు లేపారు. వివరాలు నమోదు చేసుకున్న అధికారులు చెవుల స్వప్న చైర్‌పర్సన్ పదవికి అనర్హురాలిగా పరిగణనలోకి తీసుకుంటున్నట్లు ప్రకటించారు. నివేదికను కలెక్టర్‌కు అందజేస్తామని, నూతన చైర్‌పర్సన్ ఎన్నిక కోసం తేదీని ప్రకటిస్తారని ఆర్డీఓ అనంతరెడ్డి, మున్సిపల్ కమిషనర్ రవీందర్‌రెడ్డి తెలిపారు.

వీరంతా సమావేశానికి గైర్హాజరు..

బలపరీక్ష కోసం నిర్వహించిన కౌన్సిల్ సమావేశానికి చైర్‌పర్సన్ చెవుల స్వప్న, వైస్‌చైర్‌పర్సన్ చామ సంపూర్ణతో పాటు కౌన్సిలర్లు బొర్ర అనురాధ, మోతె మణెమ్మ, దేవిడి గీత, మల్‌రెడ్డి దీపిక, సామ అనూష గైర్హాజరయ్యారు.

నూతన చైర్‌పర్సన్ రేసులో జయశ్రీ

నూతన చైర్‌పర్సన్‌గా 8వ వార్డుకు చెందిన పండుగుల జయశ్రీని ఎన్నుకునేందుకు కౌన్సిలర్లంతా నిర్ణయానికి వచ్చినట్లు తెలుస్తోంది. ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి, రోడ్ల అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ మల్‌రెడ్డి రాంరెడ్డి, మెజార్టీ కౌన్సిలర్ల మద్దతు కూడగట్టుకున్న జయశ్రీ కొత్త చైర్‌పర్సన్‌గా ఎన్నిక కావడం లాంఛనమేనని చర్చించుకుంటున్నారు.

బాల్యం.. చిక్కి శల్యం!

- ఎత్తుకు తగ్గ బరువు లేని చిన్నారులు
- పోషక లోపంతో బాధపడుతున్న వైనం
- జిల్లాలో సాధారణం కంటే తక్కువ బరువున్న చిన్నారులు ఆరు వేలకుపైనే..
- పక్కదారి పడుతున్న పౌష్టికాహారం



సాక్షి, రంగారెడ్డిజిల్లా: బాల్యం బక్క చిక్కుతోంది. నిరుపేద కుటుంబాల్లో పుట్టిన పిల్లలు పౌష్టికాహారానికి దూరమై తరచూ అస్వస్థతకు గురవుతున్నారు. తక్కువ బరువుతో బాధపడుతున్న చిన్నారుల ఆరోగ్య పరిరక్షణకు ప్రభుత్వం ప్రతి నెలా సమగ్ర శిశు అభివృద్ధి సేవా పథకం (ఐసీడీఎస్) ద్వారా పాలు, గుడ్లు, బాలామృతం, ఇతర ఆహార పదార్థాలు సరఫరా చేస్తోంది. కానీ ఈ పౌష్టికాహారం నిజమైన లబ్ధిదారులకు చేరడం లేదు. ఫలితంగా అసలే ఎత్తుకు తగ్గ బరువు లేక బక్కచిక్కిన పిల్లలను పలు ఆరోగ్య సమస్యలు వెంటాడుతున్నాయి. జిల్లాలో ఆరేళ్ల లోపు చిన్నారులు 1,44,000 మంది ఉండగా, వీరిలో 5,657 మంది సాధరణం కంటే తక్కువ, 656 మంది అతి తక్కువ బరువుతో బాధపడుతున్నారు.

గుట్టుగా సరుకుల తరలింపు..

జిల్లాలో 1,600 అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి. వీటిలో ఆరేళ్లలోపు చిన్నారులు పేర్లు నమోదు చేసుకున్నారు. మూడేళ్లలోపు పిల్లలకు ప్రతి నెలా ఒకటో తేదీన రెండున్నర కిలోల చొప్పున బాలామృతం అందజేస్తున్నారు. మూడు నుంచి ఆరేళ్ల పిల్లలకు హాట్‌మీల్‌లో భాగంగా ప్రతి రోజు ఉదయం 10 గంటలకు ఒక గుడ్డు, మధ్యాహ్నం ఆకు కూరలు, పప్పుతో భోజనం, మధ్యాహ్నం 3 గంటలకు న్యూట్రిన్ మురుకులను సరఫరా చేస్తున్నారు. కొంతమంది అంగన్‌వాడీ కేంద్రం నిర్వాహకులు బాలామృతాన్ని కోళ్లదాణా కింద విక్రయిస్తున్నట్టు ఆరోపణలు ఉన్నాయి. చిన్నారుల కోసం ప్రభుత్వం సరఫరా చేస్తున్న గుడ్లు, పాలు, బియ్యం వంటి సరుకులను గుట్టుగా బయటికి తరలిస్తున్నారు. నిజానికే అంగన్‌వాడీ కేంద్రం నిర్వాహకులే వీటిని వడ్డించాల్సి ఉంది. కానీ జిల్లాలోని మెజార్టీ కేంద్రాల్లో ఈ పని చేయడం లేదు. ఫలితంగా పిల్లలకు అందాల్సిన పౌష్టికాహారం అందకుండా పోతుండడంపై సర్వత్రా ఆందోళన వ్యక్తం అవుతోంది.

బాధ్యతగా పని చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ శశాంక

పిల్లల పెరుగుదల.. పోషణ లోపం తగ్గించడం.. బరువు లోపం లేకుండా పోషకాహారాలను అందించడంలో ప్రతి ఒక్కరూ బాధ్యతగా పని చేయాలని కలెక్టర్ శశాంక సంబంధిత అధికారులకు సూచించారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో శుక్రవారం జిల్లా సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన పోషణ మాసం కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఈనెల 30 వరకు నిర్వహిస్తున్న పోషణ మాసంలో భాగంగా రక్తహీనత, పౌష్టికాహార లోపంపై తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలని అన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా పిల్లల్లో ప్రస్తుతం ఉన్న బరువు, ఉండాల్సిన బరువు వివరాలను నమోదు చేయాలని, అనీమియా రాకుండా తగిన చర్యలు తీసుకోవాలన్నారు. గ్రామస్థాయి కమిటీలు బాధ్యతగా పని చేయాలని, పిల్లల కచ్చితమైన బరువును నిర్ధారించాలని ఆదేశించారు. కార్యక్రమంలో జిల్లా మహిళా శిశు సంక్షేమాధికారి పద్మజా రమణ, జిల్లా వైద్యాధికారి డాక్టర్ వెంకటేశ్వరరావు, డీపీఓ సురేష్ మోహన్ తదితరులు పాల్గొన్నారు.

6/6

- మదర్ డెయిరీ ఎన్నికల్లో కాంగ్రెస్ మద్దతుదారుల హవా
- ఆరింటికి ఆరు డైరెక్టర్ స్థానాల్లో విజయఢంకా
- ఫలించని బీఆర్ఎస్ ప్రయత్నాలు
- నేడు నూతన చైర్మన్ ఎన్నిక



గెలిచిన ఆరుగురు డైరెక్టర్లతో విజయ సంకేతం చూపుతున్న ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య, మదర్ డెయిరీ మాజీ చైర్మన్ గుత్తా జితేందర్‌రెడ్డి

సాక్షి, యాదాద్రి: నల్లగొండ– రంగారెడ్డి పాల ఉత్పత్తిదారుల పరస్పర సహాయ సహకార సమితి లిమిటెడ్ మదర్ డెయిరీ ఎన్నికల్లో ఓటర్లు కాంగ్రెస్ పార్టీ మద్దతుదారులకే పట్టంకట్టారు. ఖాళీగా ఉన్న ఆరు డైరెక్టర్ల పదవులకు శుక్రవారం జరిగిన ఎన్నికలో కాంగ్రెస్ బలపర్చిన అభ్యర్థులు విజయం సాధించారు. గెలుపు కోసం తుది వరకు పోరాడిన బీఆర్ఎస్‌కు భంగపాటు తప్పలేదు. ఆ పార్టీ బలపర్చిన నలుగురు అభ్యర్థులు ఓటమి పాలయ్యారు. ఓటింగ్ శుక్రవారం హయత్‌నగర్‌లో జరిగింది. 297 మంది పాల సొసైటీ చైర్మన్లు ఓటు హక్కు వినియోగించుకున్నారు. ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని నాలుగు డైరెక్టర్లకు 8 మంది, రంగారెడ్డి జిల్లాలోని రెండు డైరెక్టర్ల స్థానాలకు నలుగురు పోటీపడ్డారు. ఉమ్మడి నల్లగొండ జిల్లా కాంగ్రెస్ నుంచి రంగంలోకి దిగిన నలుగురు గుడిపాటి మధుసూదన్‌రెడ్డి (229 ఓట్లు), పుప్పాల నర్సింహులు (181 ఓట్లు), బత్తుల నరేందర్‌రెడ్డి (177 ఓట్లు), కల్లెపల్లి శ్రీశైలం (222 ఓట్లు) గెలుపొందగా, రంగారెడ్డి జిల్లాలో కాంగ్రెస్ నుంచే పోటీ చేసిన నలుగురిలో అగ్రాల నర్సింహారెడ్డి (242 ఓట్లు), మండలి జంగయ్య (237 ఓట్లు) గెలుపొందారు.

పెరిగిన కాంగ్రెస్ బలం

మదర్ డెయిరీలో మొత్తం 15 డైరెక్టర్ పదవులు ఉన్నాయి. అందులో ఆరు స్థానాలకు పదవీ కాలం ముగియడంతో ఎన్నిక నిర్వహించారు. ఈ ఆరు పదవులను కాంగ్రెస్ మద్దతుదారులు గెలుచుకున్నారు. పదవిలో కొనసాగుతున్న 9 మంది డైరెక్టర్లలో కూడా ఆరుగురు ఇప్పటికే కాంగ్రెస్‌కు మద్దతు తెలిపారు. దీంతో మదర్ డెయిరీలో కాంగ్రెస్ బలం 12కు చేరింది.

నేడు చైర్మన్ ఎన్నిక

మదర్ డెయిరీ చైర్మన్ ఎన్నిక కోసం అధికారులు ఏర్పాట్లు చేశారు. 15 మంది పాలకవర్గ సభ్యులతో శనివారం ఉదయం 11 గంటలకు సమావేశం ఏర్పాటు చేశారు. ముందుగా నూతనంగా ఎన్నికైన డైరెక్టర్లకు పదవీ కాలాన్ని లాటరీ పద్ధతిలో నిర్ణయిస్తారు. ఇందులో ముగ్గురు డైరెక్టర్లకు నాలుగు సంవత్సరాలు, మిగతా ముగ్గురికి ఐదు సంవత్సరాలు పదవీకాలంగా నిర్ణయిస్తారు. అనంతరం శనివారంతో పదవీకాలం ముగియనున్న చైర్మన్ స్థానంలో నూతన చైర్మన్‌ను ఎన్నుకోనున్నారు. మెజార్టీ సభ్యులు బలపర్చిన అభ్యర్థి చైర్మన్‌గా ఎన్నిక అవుతారు. కాంగ్రెస్ మద్దతుదారులు ఎక్కువ ఉన్నందున ఆ పార్టీకి చెందిన డైరెక్టరే చైర్మన్ అవుతారు.

చైర్మన్‌గా గుడిపాటి మధుసూదన్‌రెడ్డి

మదర్ డెయిరీ నూతన చైర్మన్‌గా యాదాద్రి జిల్లా తుర్కపల్లి మండలం వెంకటాపురం గ్రామానికి చెందిన గుడిపాటి మధుసూదన్ రెడ్డిని నిర్ణయించినట్లు ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య వెల్లడించారు. గత ప్రభుత్వంలో మాదిరిగా సీల్డ్ కవర్ చైర్మన్ ఎంపిక ఉండదన్నారు. పార్టీలో అందరి సమక్షంలో ముందుగా చైర్మన్ అభ్యర్థిగా గుడిపాటి పేరును ప్రతిపాదించినట్లు చెప్పారు. తమ పార్టీ బలపరిచిన అభ్యర్థులను డైరెక్టర్లుగా గెలిపించిన పాల సొసైటీ చైర్మన్లకు రుణపడి ఉంటామని అయిలయ్య అన్నారు.

వ్యక్తి అదృశ్యం

తాండూరు టౌన్: వ్యక్తి అదృశ్యమైన ఘటన తాండూరు టౌన్ పీఎస్ పరిధిలో చోటు చేసు కుంది. సీఐ సంతోష్‌కుమార్ తెలిపిన ప్రకారం అయ్యప్ప నగర్‌కు చెందిన శ్రీకాంత్(30) ఈ నెల 10న తండ్రికి ఫోన్ చేసి ఇంటికి బయలుదేరానని చెప్పి రాలేదు. దీంతో కాళిదాసు పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

యువకుడి బలవన్మరణం

నందిగామ: కూలీ పని చేసుకుంటే జీవనం సాగించే ఓ యువకుడు బలవన్మరణానికి పాల్పడ్డాడు. ఈ ఘటన మండల పరిధిలోని చేగూరులో శుక్రవారం వెలుగులోకి వచ్చింది. నందిగామ ఇన్‌స్పెక్టర్ ప్రసాద్ తెలిపిన ప్రకారం.. గ్రామానికి చెందిన కొంగరి మహేందర్(20) గురువారం రాత్రి భోజనం చేసి 9గంటల ప్రాంతంలో బయటకు వెళ్లాడు. రాత్రి 10గంటలకు తల్లిదండ్రులు ఫోన్ చేయగా ఫోన్ స్విచ్ఛాఫ్ వచ్చింది. వినాయక మండపం వద్ద ఉన్నాడనుకున్నారు. ఉదయం గ్రామ సమీపంలోని చింత చెట్టుకు ఉరేసుకున్నట్లు గ్రామస్తుడు కొంగరి యాదయ్య చూసి తల్లిదండ్రులకు సమాచారం ఇచ్చాడు. మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం షాద్‌నగర్ కమ్యూనిటీ ఆస్పత్రికి తరలించారు.

ఆటో డ్రైవర్‌పై దాడి కేసులో ఏడేళ్ల జైలు

పహాడీషరీఫ్: పహాడీషరీఫ్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఆటోడ్రైవర్‌పై దాడి చేసిన ఘటనలో నిందితుడికి ఎల్‌బీ నగర్ న్యాయస్థానం ఏడేళ్ల కారాగార శిక్ష విధించింది. పోలీసులు తెలిపిన ప్రకారం.. 2020లో ఆటోలో ఎక్కిన అబ్బుషేర్ కాలనీకి చెందిన నిందితుడు సయ్యద్ ఉస్మాన్ హుస్సేన్ అలియాస్ మెంటల్ ఉస్మాన్(31) తాగిన మత్తులో ఆటోడ్రైవర్‌పై దాడికి పాల్పడ్డాడు. ఈ ఘటనపై హత్యాయత్నం కేసు నమోదు చేసిన పోలీసులు కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు. కేసును విచారించిన నాలుగో అదనపు సెషన్స్ న్యాయమూర్తి నిందితుడికి ఏడేళ్ల కఠిన కారాగార శిక్షను విధిస్తూ శుక్రవారం తీర్పును వెల్లడించారు.

ఆస్తిపై కన్నేసి.. అన్నను హతమార్చి

- ఫిర్యాదు దారుడినే హంతకుడిగా తేల్చిన పోలీసులు
- వివరాలు వెల్లడించిన పట్టణ సీఐ విజయ్‌కుమార్


వివరాలను వెల్లడిస్తున్న పట్టణ సీఐ విజయ్‌కుమార్

షాద్‌నగర్‌రూరల్: ఆస్తి కోసం అన్ననే హత మార్చాడు ఓ ప్రబుద్ధుడు. ఆపై మృతదేహాన్ని చెరువులోపడేసి ఆత్మహత్యగా చిత్రీకరించేందుకు యత్నించాడు. పోలీసులు తమదైన శైలిలో విచారణ చేపట్టి హత్యగా తేల్చేశారు. ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని దూసకల్ గ్రామంలో చోటుచేసుకున్న ఈ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఇందుకు సంబంధించిన వివరాలు శుక్రవారం పట్టణ సీఐ విజయ్‌కుమార్ వెల్లడించారు. ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని దూసకల్ గ్రామానికి చెందిన కృష్ణయ్యయాదవ్(50), కళమ్మ అలియాస్ కళావతి దంపతులకు పిల్లలు లేరు. దీంతో వారు ఒక బాబును దత్తత తీసుకుని కృష్ణయ్యయాదవ్ అత్తగారి ఊరైన మహేశ్వరం మండలం కల్వకోలు గ్రామంలో ఉంచారు. ఆయన భార్య కళావతి రెండేళ్ల క్రితం అనారోగ్యంతో మృతి చెందింది. దీంతో కృష్ణయ్యయాదవ్ ఒంటరిగా జీవిస్తున్నాడు.

10న పోలీసులకు ఫిర్యాదు

కృష్ణయ్యయాదవ్ కనిపించకపోవడంతో గ్రామస్తులు వెతకడం మొదలు పెట్టారు. తన అన్న కనిపించడం లేదని ఈ నెల 10న పోలీసులకు ఫిర్యాదు చేశాడు. నాలుగు రోజుల తరువాత కృష్ణయ్యయాదవ్ మృతదేహం చెరువులో తేలియాడడంతో విషయాన్ని తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు. భార్య చనిపోవడం, పిల్లలు లేక, మతిస్థిమితం సరిగా లేకపోవడంతో ఆత్మహత్య చేసుకున్నాడని చంద్రయ్యయాదవ్ పోలీసులను నమ్మించేందుకు యత్నించాడు. అతని మాటలపై అనుమానం రావడంతో పోలీసులు తమదైన శైలిలో విచారించారు. దీంతో ఆస్తికోసం తానే హత్య చేసినట్లు ఒప్పుకొన్నాడు.

నగలు, నగదు, ఆస్తి పత్రాలు స్వాధీనం

కృష్ణయ్యాదవ్‌ను హత్య చేసిన రోజే చంద్రయ్య యాదవ్ తన అన్న ఇంటికివెళ్లి ఇంట్లోని నగదు, బంగారం, ఆస్తి పత్రాలను ఎత్తుకెళ్లాడు. కృష్ణయ్యయాదవ్ అంత్యక్రియలకు వచ్చిన మృతుడి అత్త ఇంట్లో నగలు, నగదు, ఆస్తి పత్రాలు లేవని గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. దీంతో చంద్రయ్యయాదవ్‌ను విచారించిన పోలీసులు బంగారం, డబ్బు, ఆస్తి పత్రాలు దొంగిలించినట్లు గుర్తించారు. నిందితుడి నుంచి మూడు తులాల బంగారం, రూ.31,500నగదు, ఆస్తి పత్రాలను స్వాధీనం చేసుకున్నారు. కేసును ఛేదించిన ఎస్ఐ సుశీల, సిబ్బంది మహేశ్, రామకృష్ణ, రఫీ, జ్యోత్స్నను పట్టణ సీఐ అభినందించారు. ఈ సమావేశంలో ఎస్ఐ బలరాం, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పది కోట్ల ఆస్తి కోసం ప్రాణం తీశాడు

వడ్డీ వ్యాపారం చేసే కృష్ణయ్యయాదవ్‌కు గ్రామశివారులో పదికోట్ల విలువ చేసే ఐదు ఎకరాల పొలం ఉంది. అన్న ఆస్తిపై తమ్ముడు చంద్రయ్యయాదవ్ కన్నేశాడు. ఎలాగైనా అన్నను అంతమొందించి ఆస్తిని కాజేయాలని పథకం వేశాడు. ఈ నెల 7న చంద్రయ్య యాదవ్ మద్యం సేవిద్దామని అన్నను బైక్‌పై ఎక్కించుకుని గ్రామంలోని చెరువు వద్దకు తీసుకెళ్లాడు. ముందస్తు పథకం ప్రకారం.. అన్నకు మద్యం ఎక్కువ మద్యం తాగించాడు. మత్తులోకి వెళ్లినట్లు నిర్ధారించుకుని చెరువులోకి తోసి అక్కడ నుంచి వెళ్లిపోయాడు.

వృద్ధుడి అదృశ్యం


బాలయ్య(ఫైల్)

మీర్‌పేట: ఇంటి నుంచి బయటకు వెళ్లిన వృద్ధుడు అదృశ్యమయ్యాడు. ఈ సంఘటన మీర్‌పేట పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన ప్రకారం.. బడంగ్‌పేట కేసీఆర్ కాలనీకి చెందిన రవి తండ్రి బాలయ్య (64) గురువారం ఉదయం బడంగ్‌పేట బస్‌స్టాప్ వద్ద కోఠి బస్సు ఎక్కి బోరబండలో దిగాడు. బంధువుల ఇంటికి వెళ్లలేదు.. తిరిగి ఇంటికి కూడా రాలేదు. దీంతో కుటుంబ సభ్యులు ఫోన్ చేయగా స్విచ్ఛాఫ్ వచ్చింది. ఎక్కడ వెతికినా ఆచూకీ తెలియకపోవడంతో కుమారుడు రవి శుక్రవారం మీర్‌పేట పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. కేసు దర్యాప్తులో ఉంది.

రూ.1.20 లక్షల కాపర్ వైర్ చోరీ

నందిగామ: ఓ పరిశ్రమకు చెందిన రూ.1.20లక్షల విలువైన కేబుల్ వైర్లను గుర్తు తెలియని దుండగులు ఎత్తుకెళ్లారు. ఈ ఘటన శుక్రవారం ఆలస్యంగా వెలుగులోని వచ్చింది. పోలీసులు తెలిపిన ప్రకారం.. మండల పరిధిలోని మేకగూడలో స్టిర్లింగ్ అండ్ విల్సన్ పరిశ్రమకు చెందిన ప్రాజెక్ట్ సైట్ ఉంది. గతేడాది సెప్టెంబర్‌లో ఇక్కడ ప్రాజెక్టుకు చెందిన మెటీరియల్‌ను నిల్వ చేశారు. ప్రతీ రోజు ప్రాజెక్ట్ అధికారులు స్టాక్ తనిఖీ చేస్తుంటారు. ఈ నెల 8న యథావిధిగా స్టాక్ తనిఖీ చేస్తున్న క్రమంలో రెండు డ్రమ్ముల్లోంచి సుమారు 328 మీటర్ల కాపర్ వైర్ చోరీ అయినట్లు గుర్తించారు. దీంతో ప్రాజెక్టు అధికారులు సెక్యూరిటీ గార్డులను, అక్కడ పనిచేసే కార్మికులను విచారించగా తమకు తెలియదన్నారు. దీంతో ప్రాజెక్టు ఉద్యోగి ఏనుగు మాధవ్‌రెడ్డి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు దర్యాప్తులో ఉంది.

బ్యాటరీల చోరీ ముఠా గుట్టురట్టు

ఒకరి అరెస్ట్.. పరారీలో మరో ఇద్దరు



పోలీసుల అదుపులో సయ్యద్ ఇర్ఫాన్ హుస్సేన్

తలకొండపల్లి: అర్ధరాత్రి వాహనాల నుంచి బ్యాటరీలు చోరీ చేస్తున్న ముఠా గుట్టు రట్టయింది. శుక్రవారం ఎస్ఐ శ్రీకాంత్ కేసు వివరాలు వెల్లడించారు. ఆగస్టు 25న గుర్తు తెలియని దుండగులు నంబర్ ప్లేట్ లేని కారులో చుక్కాపూర్‌కు వచ్చారు. ఎనిమిది రైతుల ట్రాక్టర్లు, ఒక టిప్పర్ నుంచి బ్యాటరీలు ఎత్తుకెళ్లారు. ఆమ నల్లు సీఐ ప్రమోద్ కుమార్ నేతృత్వంలో సీసీఎస్ పోలీసుల సహకారంతో ఎస్సై శ్రీకాంత్ ఆధ్వర్యంలో మూడు బృందాలు ఎనిమిది మండలాల్లో సీసీ టీవీ ఫుటేజీలు పరిశీలించారు. ఫోన్ కాల్ డాటా ఆధారంగా చోరీకి పాల్పడిన ముగ్గురు దొంగలను గుర్తించి సయ్యద్ ఇర్ఫాన్ హుస్సేన్‌ను అదుపులోకి తీసుకున్నారు. మరో ఇద్దరు పరారీలో ఉన్నట్లు ఎస్ఐ తెలిపారు. నిందితులు నగరంలోని చంద్రాయణగుట్ట, బండ్లగూడ ప్రాంతానికి చెందినవారిగా గుర్తించామని చెప్పారు. కేసును ఛేదించిన కానిస్టేబుల్ జాషువా, రఘు, సీఐ ప్రమోద్‌కుమార్ ఎస్ఐ శ్రీకాంత్‌లను అభినందించి రివార్డు అందజేశారు.

పల్లవి ప్రశాంత్ పాస్‌పోర్టు రిలీజ్

సిటీ కోర్టులు: అమెరికాలోని అట్లాంటాలో జరగనున్న బతుకమ్మ, దసరా ఉత్సవాలకు వెళ్లేందుకు బిగ్‌బాస్ విన్నర్ పల్లవి ప్రశాంత్‌కు అనుమతిస్తూ..కోర్టులో ఉన్న పాస్‌పోర్టును రిలీజ్ చేస్తున్నట్లు నాంపల్లి కోర్టు ఉత్తర్వులు జారీ చేసింది. 2023లో పల్లవి ప్రశాంత్‌పై జూబ్లీహిల్స్ పోలీసులు కేసు నమోదు చేయగా..అతన్ని రిమాండ్‌కు తరలించిన విషయం తెలిసిందే. రిమాండ్ నుంచి బెయిల్ మంజూరు అయినప్పుడు ప్రశాంత్‌కు సంబంధించిన పాస్‌పోర్ట్‌ను కోర్టులో ఉంచాలని న్యాయస్థానం ఆదేశాలు జారీ చేసింది. అప్పటి నుంచి పాస్‌పోర్ట్ నాంపల్లి కోర్టులోనే ఉన్నది. ఇటీవల అట్లాంటా తెలుగు అసోసియేషన్ నుంచి ఆహ్వానం రావడంతో తన పాస్‌పోర్టు ఇవ్వాలని పల్లవి ప్రశాంత్ పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై శుక్రవారం నాంపల్లి 17 అదనపు చీఫ్ మెట్రోపాలిటన్ మెజిస్ట్రేట్ విచారణ చేపట్టింది. పిటిషనర్ తరపు న్యాయవాదులు వాదనలు విన్న న్యాయమూర్తి పల్లవి ప్రశాంత్ అట్లాంటా ఉత్సవాలకు వెళ్లేందుకు అనుమతిస్తూ పాస్‌పోర్ట్‌ను 3 నెలల వరకు రిలీజ్ చేసింది. తిరిగి డిసెంబర్ 13వ తేదీ లోపు పాస్‌పోర్ట్‌ను కోర్టులో అందజేయాలని ఆదేశించారు.

బాలికను బలిగొన్న బడి బస్సు

మల్లంపేటలోని ఓ పాఠశాలగ్రౌండ్‌లో దుర్ఘటన

దుండిగల్: స్కూల్ బస్సు ఢీకొని మూడేళ్ల చిన్నారి మృతి చెందిన సంఘటన దుండిగల్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. మల్లంపేటలోని డ్రీమ్‌వ్యాలీ కాలనీకి చెందిన కుంట రాజు, స్వప్న దంపతులకు ఇద్దరు కుమార్తెలు. వీరి చిన్న కుమార్తె మాన్విత (3) స్థానికంగా ఉన్న ఓక్ లీఫ్ స్కూల్‌లో ఎల్‌కేజీ చదువుతోంది. శుక్రవారం ఉదయం స్కూల్ బస్సులో పాఠశాలకు వెళ్లింది. గ్రౌండ్‌లో బస్సు దిగి వెళ్తుండగా అదే బస్సు ఢీకొట్టడంతో తీవ్రంగా గాయపడింది. చిన్నారిని వెంటనే ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు చెప్పారు. బస్సు డ్రైవర్‌ను స్కూల్ యాజమాన్యం అక్కడి నుంచి పంపించివేయడం పలు అనుమానాలకు తావిస్తోంది. చిన్నారి బస్సులోంచి దిగే క్రమంలో జారి కింద పడి చనిపోయిందని యాజమాన్యం తమకు సమాచారం అందించిందని, నిర్లక్ష్యంగా వ్యవహరించిన డ్రైవర్‌తో పాటు యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని మృతురాలి తల్లిదండ్రులు డిమాండ్ చేశారు. డ్రైవర్ నవీన్‌ను పోలీసులు అదుపులోకి తీసుకుని విచారణ చేస్తున్నారు.

భారతీయ విద్యాభవన్‌కు 'బెస్ట్ ఆఫ్ కన్వెన్షన్ అవార్డు

సాక్షి, హైదరాబాద్: విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసం పెంపొందించడం, అలాగే జాయ్ ఆఫ్ లెర్నింగ్ అంశాల్లో భారతీయ విద్యాభవన్ పబ్లిక్ స్కూల్ బీహెచ్ఇఎల్ విద్యార్థులు చూపిన ప్రతిభకు వారికి 'బెస్ట్ ఆఫ్ కన్వెన్షన్ అవార్డు' లభించింది. క్వాలిటీ సర్కిల్ ఫోరం ఆఫ్ ఇండియా హైదరాబాద్ సర్కిల్ నిర్వహించిన పోటీల్లో మొత్తం 233 విద్యార్థుల బృందాలు పాల్గొన్న ఈ పోటీలో ఉత్తమ కన్వెన్షన్ అవార్డు లభించింది. గురువారం రాత్రి జరిగిన ఓ కార్యక్రమంలో వారికి అవార్డును అందించారు. విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసం పెంపొందించే అంశంలో క్రిస్టల్ టీమ్‌లోని విద్యార్థులు తన్విశ్రీ పద్మ, ఆదర్శ్, సుప్రతిక్ దాస్, చాతుర్య, 'ప్రిస్మ్' టీమ్‌లో అభిజ్ఞ, హరిణి, వసంత్, అన్విత్ లిఖిత, అంకితలను పాఠశాల ప్రిన్సిపాల్ ఉమాశాస్త్రి, వైస్-ప్రిన్సిపాల్ శ్రీవాణి, ఫెసిలిటేట్ సుధారాణి, ఎగ్జిక్యూటివ్ గైడ్ వనిత అభినందించారు. నిరంతర శిక్షణతోనే ఇది సాధ్యమైందని తెలిపారు.

గత ప్రభుత్వం పట్టించుకోలే..

- మీరైనా న్యాయం చేయండి
- వ్యవసాయ కమిషన్ చైర్మన్‌ను కోరిన పర్వతారోహకుడు తుకారాం


ముదిరెడ్డి కోదండరెడ్డికి మొక్క అందజేస్తున్న తుకారాం

యాచారం: ఎవరెస్టును అధిరోహించిన పర్వతారోహకుడు అంగోత్ తుకారాం శుక్రవారం నగరంలోని రాష్ట్ర వ్యవసాయ, రైతు సంక్షేమ కమిషన్ చైర్మన్ ముదిరెడ్డి కోదండరెడ్డిని కలిసి శుభాకాంక్షలు తెలిపాడు. ప్రాణాలకు తెగించి ప్రపంచంలోనే ఎత్తైన ఐదు పర్వతాలను అధిరోహించి రికార్డు సృష్టించినా గత ప్రభుత్వం తనను పట్టించుకోలేదని వాపోయాడు. నిరుపేద గిరిజన కుటుంబానికి చెందిన వాడిని కావడంతోనే గుర్తింపు లేకుండా పోయిందని కోదండరెడ్డి ముందు ఆందోళన వ్యక్తం చేశాడు. ప్రస్తుత ప్రభుత్వంలోనైన తనకు గుర్తింపు వచ్చేలా చూడాలని కోరాడు. ఇందుకు స్పందించిన కోదండ రెడ్డి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి న్యాయం చేసేలా కృషి చేస్తానని తుకారాంకు హామీ ఇచ్చాడు.

ఎమ్మెల్యేల వివాద ఘటనపై రెండు కేసులు

కేశంపేట: గచ్చిబౌలిలో నమోదైన కేసులో భాగంగా శాంతి భద్రతలకు పరిరక్షణకు ఎమ్మెల్యేలు హరీశ్‌రావు, గంగుల కమలాకర్, ప్రశాంత్‌రెడ్డి, పల్లా రాజేశ్వర్‌రెడ్డిలతో పాటుగా మరి కొంత మందిని కేశంపేట పీఎస్‌కు తరలించారు. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్, అతని కుమారులు, ఎక్లాస్‌ఖాన్‌పేట చెందిన రవియాదవ్, మురళీ యాదవ్, కొత్తపేటకు చెందిన జమాల్‌ఖాన్, నవీన్, కాకునూరుకు చెందిన రమేష్‌గౌడ్, నిర్దవెల్లికి చెందిన నిరంజన్, సుధాకర్, మల్లయ్య, తాటిగడ్డకు చెందిన ధన్‌రాజ్‌రెడ్డి, కేశంపేటకు చెందిన వెంకట్‌రెడ్డి, మరి కొంత మంది కేశంపేట ఠాణాకు వచ్చారు. వారు పీఎస్ ఆవరణలో నినాదాలు చేస్తూ.. విధులకు ఆటంకం కల్పించారని ఏఎస్ ఐ నర్సింలు ఫిర్యాదు చేసినట్లు విశ్వసనీయ సమాచారం.

పోలీసు ఎస్కాట్ వాహనంపై దాడి

బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను అరెస్టు చేసి కేశంపేట ఠాణకు తీసుకొస్తున్న సమయంలో మండల పరిధిలోని కొత్తపేట గ్రామంలో ఎస్కాట్ వాహనంపై మాజీ ఎంపీపీ రవియాదవ్, మురళీ యాదవ్, నవీన్, జమాల్‌ఖాన్, లక్ష్మణ్, జగన్, బంద నిరంజన్, మల్లయ్య, సుధాకర్, వెంకట్‌రెడ్డి, ధన్‌రాజ్‌రెడ్డి బస్సు పైకి ఎక్కి అద్దాలను ధ్వంసం చేసినట్లు, ఈ మేరకు సైబరాబాద్ హెడ్‌క్వార్టర్‌లో వాహన డ్రైవర్ రమేష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సమాచారం. ఎమ్మెల్యే వివాద ఘటనపై గురువారం శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తారనే ఉద్దేశంతో కేశంపేట ఏఎస్ఐ సోమనర్సింలు ఫిర్యాదు మేరకు మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్, నవీన్, సాజిద్, జమాల్‌ఖాన్, నరేష్, శ్రీనివాస్, వెంకట్‌రెడ్డి, ఆంజనేయులు, శ్రీశైలంగౌడ్, అంజిరెడ్డి తదితరులను అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసినట్లు విశ్వసనీయ సమాచారం అందింది.

వేగ నియంత్రణతో ప్రమాదాల నివారణ

రాజేంద్రనగర్ ట్రాఫిక్ ఏసీపీ బాలాజీ


పనులను పరిశీలిస్తున్న రాజేంద్రనగర్ ట్రాఫిక్ ఏసీపీ బాలాజీ, సీఐ వెంకటేశం, సిబ్బంది

చేవెళ్ల: వాహనదారులు రోడ్డు మలుపుల వద్ద, బస్ స్టేజీల వద్ద వేగ నియంత్రణ పాటించాలని రాజేంద్రనగర్ ట్రాఫిక్ ఏసీపీ బాలాజీ అన్నారు. మండల పరిధిలోని హైదరాబాద్-బీజాపూర్ హైవేపై మలుపుల వద్ద, చేవెళ్ల నుంచి షాద్‌నగర్ వెళ్లే రోడ్డుపై ఉన్న బస్‌స్టేజీల వద్ద శుక్రవారం వాహనాల వేగ నియంత్రణకోసం చేవెళ్ల ట్రాఫిక్ సీఐ వెంకటేశం, సిబ్బందితో కలిసి ట్రాఫిక్ బొల్లార్డ్స్ ఏర్పాటు చేయించారు. ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ.. రోడ్డుపై వెళ్లే వాహనదారులు తప్పని సరిగా ట్రాఫిక్ రూల్స్ పాటించాలన్నారు. వాహనదారులు మద్యం సేవించి వాహనాలు నడపవద్దని సూచించారు. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్, కారులో వెళ్లే వారు సీటు బెల్టు తప్పక ధరించాలన్నారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ సీఐ వెంకటేశం, చేవెళ్ల ట్రాఫిక్ పోలీస్ సిబ్బంది ఉన్నారు.

రూ.5 లక్షల విలువ చేసే గంజాయి పట్టివేత

బంజారాహిల్స్: జూబ్లీహిల్స్ రోడ్డునెంబర్-10లో ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ టీమ్, జూబ్లీహిల్స్ పోలీసులు సంయుక్తంగా నిర్వహించిన తనిఖీల్లో ఇద్దరు యువకులు బైక్‌పై పెద్ద ఎత్తున గంజాయిని తరలిస్తూ పట్టుబడ్డారు. ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ కే వాసుదేవరావు తెలిపిన వివరాల ప్రకారం..హైదరాబాద్ జిల్లా ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి అనిల్‌కుమార్‌రెడ్డి ఆదేశాల మేరకు ఎన్‌ఫోర్స్‌మెంట్ టీమ్ రూట్‌వాచ్ చేస్తుండగా టీఎస్ 09 యూబీ 3159 నెంబర్ బైక్‌పై ఎనిమిది కిలోల డ్రై గంజాయిని తరలిస్తుండగా పట్టుకున్నారు. బీహార్‌కు చెందిన చమన్‌కుమార్ సాహా, హఫీజ్‌పేటకు చెందిన సాయినాథ్ ఈజీ మనీ కోసం అలవాటు పడి అవసరమైన వారికి గంజాయి విక్రయించేందుకు పెద్ద ఎత్తున తరలిస్తున్నట్లుగా దర్యాప్తులో తేలింది. స్వాధీనం చేసుకున్న గంజాయి విలువ రూ.5 లక్షలు ఉంటుందని, నిందితులిద్దరినీ అరెస్టు చేశామని, గంజాయితో పాటు బైక్‌ను సీజ్ చేసినట్లు పోలీసులు తెలిపారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

అత్తాపూర్: డివైడర్‌ను ఢీకొని తలకు తీవ్ర గాయాలైన మెకానిక్ రఫీయుద్దీన్ చికిత్స పొందుతూ మృతి చెందిన ఘటన అత్తాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఏఎస్ఐ ప్రభాకర్ తెలిపిన వివరాల ప్రకారం.. నో- నెంబర్ ప్రాంతానికి చెందిన రఫీయుద్దీన్(37) అత్తాపూర్ మూసి పరివాహక ప్రాంతంలో ఉన్న ఓ లారీ మెకానిక్ గ్యారేజ్‌లో గత కొంతకాలంగా పనిచేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. ఈ నెల 10న నీలోఫర్ ఆసుపత్రిలో అతని భార్య డెలవరీ అయ్యింది. ఉదయం 6 గంటలకు నీలోఫర్ ఆసుపత్రికి వెళ్లి భార్యను చూసి వస్తుండగా పీవీ నరసింహారావు ఎక్స్‌ప్రెస్‌వే-136 పిల్లర్ నెంబర్ ప్రాంతంలో ఉన్న డివైడర్‌ను ద్విచక్రవాహనంపై వెళ్తున్న రఫీయుద్దీన్ ఢీకొన్నాడు. ఈ ఘటనలో తలకు తీవ్రంగా గాయాలుకాగా, ఉస్మానియా ఆసుపత్రిలో చికిత్స పొందుతూ శుక్రవారం మధ్యాహ్నం మృతి చెందాడు. ఈ మేరకు పోలీసులు శవపరీక్ష అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అందజేశారు.

రోగాలను దరిచేరనీయొద్దు

మణికొండ: 'ఫ్రైడే-డ్రైడే'లో భాగంగా 4వ వార్డు హుడాకాలనీ, భాగ్యలక్ష్మి కాలనీలో ప్రజలకు దోమల వ్యాప్తి, రోగాల గురించి శుక్రవారం మున్సిపల్ కమిషనర్ డి. ప్రదీప్‌కుమార్ అవగాహన కల్పించారు. నీటి నిలువలు, అపరిశుభ్రతను తొలగింపు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇటీవల కురిసిన వర్షాలు, మారుతున్న వాతావరణ పరిస్థితులతో ఎక్కువ మంది రోగాల భారిన పడుతున్నారని, వాటికి ప్రధాన కారణం దోమల వ్యాప్తి అని వాటిని నివారించి రోగాలను దరిచేరనివ్వకుండా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో శానిటేషన్ ఇంచార్జి సంపత్, సిబ్బంది పాల్గొన్నారు.